క్లుప్తంగా

పొదుపు సభ్యుల నమోదును పూర్తిచేయాలి



పొదుపు లీడర్లకు సూచనలిస్తున్న ఏపీఎం రుక్మిణి

కొడవలూరు: ఎన్‌ఆర్‌ఎల్‌ఎం(నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్)లో పొదుపు సభ్యుల వివరాల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి సూచించారు. మండలంలోని గండవరంలో పొదుపు గ్రూపుల లీడర్‌లతో ఆదివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పొదుపు సభ్యురాలి ఆధార్, బ్యాంక్ ఖాతా, ఫోన్ నంబర్‌లను లోకోస్ యాప్‌లోని ఎన్‌ఆర్‌ఎల్‌ఎంలో విధిగా నమోదు చేయాలన్నారు. మండలంలో 1,255 పొదుపు గ్రూపులుంటే ఇప్పటి వరకు 850 గ్రూపులకు సంబంధించిన సభ్యుల వివరాలు మాత్రమే పరిపూర్ణంగా నమోదు చేశారన్నారు. నమోదు కాని సభ్యుల వివరాలను వారం రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. నమోదు సమయంలో పొదుపు సభ్యుల ఫొటోలను విధిగా తీయాల్సి ఉన్నందున వారు అందుబాటులో ఉండాలన్నారు. ఎన్‌ఆర్‌ఎల్‌ఎంలో నమోదైన సభ్యులే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంక్ రుణాలకు అర్హులవుతారని స్పష్టం చేశారు. నమోదు కాని సభ్యులు వీఓఏలను సంప్రదించి విధిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీ మమత, వీఓఏ ప్రభావతి, సంఘ బంధం అధ్యక్షురాలు విజయమ్మ, పొదుపు గ్రూపుల లీడర్‌లు పాల్గొన్నారు.

జిమ్ కిట్ అందజేత



కిట్‌ను అందుకున్న యువకులు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని ఇస్కపాళేనికి చెందిన యువకులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కోడూరు మధుసూదన్‌రెడ్డి చేతులమీదుగా జిమ్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం అవసరమని తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక యువతకు జిమ్ కిట్ అవసరమని ఇటీవల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని కోరగా ఆయన వెంటనే అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కిరణ్ పాల్గొన్నారు.

మనుబోలులో రైతు సంఘ సమావేశం

మనుబోలు : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశం మనుబోలు మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కన్వీనర్ గంగపట్నం రమణయ్య మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రెండెకరాల వరకు సాగు చేస్తున్న రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు షానవాజ్, రమణయ్య, నారాయణ, వెంకటరమణయ్య, రమేష్, చినరమణయ్య ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం: మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో జీఎస్‌ఆర్ మినరల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న మానుజప్ప(40) కనిపించడం లేదని మేస్త్రి రవిచంద్ర వెంకటాచలం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కర్నాటక రాష్ట్రంలోని మాండ్య జిల్లా, శ్రీరంగపట్నం మండలం, మొగరాహళ్లి గ్రామానికి చెందిన మానుజప్ప, మరికొందరు మేస్త్రి రవిచంద్రతో కలిసి జీఎస్‌ఆర్ మినరల్స్ కంపెనీలో పని చేస్తున్నారు. ఈనెల 5వ తేదీ నుంచి మానుజప్ప కనిపించకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలతో పాటు, స్వగ్రామంలో కూడా విచారించారు. అయితే మానుజప్ప ఆచూకీ తెలియకపోవడంతో మేస్త్రి రవిచంద్ర ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమ మహోత్సవాల్లో భాగంగా పద్మావతీనగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీసాయిమాత నిత్య అన్నప్రసాదాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో మాడరన్ ఐ ఆస్పత్రి వైద్యులు హెచ్ భారతి, ఎం సాయిరామ్‌చరణ్, ఎం రామసుబ్బారావు, డీ కుమారస్వామి, తదితరులు సుమారు 500 మందికిపైగా రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 90మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్లు శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరం మేనేజింగ్‌ట్రస్టీ మధుసాయి తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ

కోవూరు నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ పట్టింది. బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, విడవలూరు మండలాల్లో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.8.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

- రూ.8.70 కోట్ల నిధులు మంజూరు
- మూడు మండలాల్లో ప్రధాన రహదారుల అభివృద్ధికి చర్యలు



బుచ్చిరెడ్డిపాళెం - జొన్నవాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు

బుచ్చిరెడ్డిపాళెం: ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇందులో భాగంగానే కోవూరు నియోజకవర్గంలో ఇప్పటికే పలు మండలాల్లో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయగా తాజాగా మరోసారి మూడు రహదారుల అభివృద్ధికి రూ.8.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. నియోజకవర్గ పరిధిలోని బుచ్చిరెడ్డిపాళెం నుంచి జొన్నవాడ వరకు ఉన్న 8.5 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ.3.20 కోట్లు, నెల్లూరు నుంచి ఇందుకూరుపేట మండలంలోని మైపాడు వయా కుడితిపాళెం వరకు ఉన్న దాదాపు 19 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ.4 కోట్లు, విడవలూరు మండలంలోని పైడేరు కాలువ నుంచి ఊటుకూరు వరకు ఉన్న రూ.2 కిలోమీటర్ల ఊటుకూరు నుంచి పల్లిపాళెం వరకు ఉన్న 2.8 కిలోమీటర్లు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.1.50 కోట్లను మంజూరు చేశారు.

త్వరలోనే టెండర్లు

నియోజకవర్గంలోని ఈ మూడు మండలాల్లో ఉన్న ప్రధాన రోడ్లకు దాదాపు రూ.8.70 కోట్ల నిధులు మంజూరు కాగా, త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించనున్నారు. ముఖ్యంగా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామి సమేత శ్రీకామాక్షితాయి ఆలయానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తారు. అలాగే జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన మైపాడు బీచ్‌కు కూడా పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. అలాగే విడవలూరు మండలంలోని తీర ప్రాంతమైన పల్లిపాళెం నుంచి ఎక్కువగా మత్స్యకారులు మత్స్య సంపదను తరలించేందుకు రోడ్లు బాగుండాలి. ఇందులో భాగంగా ఈ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ

నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, విడవలూరు మండలాల్లో ఉన్న ప్రధాన రహదారుల అభివృద్ధికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా ఈ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపడంతో పాటు నిధుల మంజూరు విషయంలో నిరంతర కృషి చేశారు. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో త్వరగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నిధుల మంజూరు సంతోషకరం



బుచ్చిరెడ్డిపాళెం నుంచి జొన్నవాడ వరకు ఉన్న రోడ్డు గత సంవత్సరం వచ్చిన వరదలకు కొట్టుకుపోయింది. అయితే అప్పట్లో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. ప్రస్తుతం తమ రోడ్డుకు రూ.3.20 కోట్లు మంజూరవడం చాలా సంతోషంగా ఉంది. త్వరగా పనులు ప్రారంభిస్తే మంచిది.

– పెంచలయ్య, సర్పంచ్ పెనుబల్లి

సాఫీ ప్రయాణం సాధ్యం



ప్రస్తుతం బుచ్చి– జొన్నవాడ రహదారిపై అక్కడక్కడ గుంతలు పడి ఉన్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ రహదారికి రూ.3.20 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయడం వల్ల సాఫీ ప్రయాణం సాధ్యమవుతుంది.

– ప్రసాద్, పెనుబల్లి

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

మనుబోలు : మనుబోలు పెద్ద చెరువు గట్టున వెలసిన గంగమ్మ తల్లి ఆలయంలో ఆషాడమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్యంశర్మ మంత్రోచ్చారణల మధ్య గంగమ్మకు అభిషేకాలు జరిపించి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా పడిగినాటి శివయ్య, నల్లిబోయిన సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

సాగుకు కంది పంట అనుకూలం

- అంతర పంటలుగా మినుము, పెసర



ఎ.వాసు, ఏఓ

పొదలకూరు : ప్రస్తుత వాతావరణం కందిపంట సాగుకు అనుకూలంగా ఉంటుందని ఏఓ ఎ.వాసు రైతులకు సూచించారు. పొదలకూరు ప్రాంతంలో తరచుగా కురుస్తున్న వర్షాల వల్ల నేలలో తగినంత తేమశాతం ఉంది. దీనివల్ల ఖరీఫ్‌లో కంది సాగు చేపట్టవచ్చు. మండలంలో మెట్టపొలాలు అధికంగా ఉన్నందున కందితో పాటు రబీ సీజన్లో మినుము, పచ్చిశనగ, పెసర పంటలు సాగుచేస్తుంటారు. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కంది అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారి వెల్లడిస్తున్నారు.

విత్తే విధానం

కంది సాగు చేసే రైతులు ప్రతి వరుసకు నాలుగు మీటర్ల ఎడమ ఉండేలా విత్తనాలు విత్తాలి. ఇందువల్ల అక్టోబరు, నవంబరు మాసాల్లో కురిసే వర్షాలకు కంది సాళ్ల మధ్య మినుము, పెసర, పచ్చిశనగ పంటలను సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. కందిని ఏకపంటగా కూడా విత్తుకోవచ్చు. వరుస, వరుసకు మధ్య రెండు మీటర్ల ఎడమ ఉండేలా చూసుకోవాలి.



సాగులో ఉన్న కంది పంట (ఫైల్)

అంతర పంటగా వేసుకోవాలి

పెసర, మినుము, పచ్చిశనగ పంటల్లో అంతర పంటగా కందిని వేసుకుంటే మేలు. అనుకోని పరిస్థితుల్లో అధిక వర్షాలు కురిసి పంటలన్నీ దెబ్బతిన్నా కంది చేతికి అందుతుంది. దీనివల్ల నష్టాలను పూడ్చుకునేందుకు రైతులకు అవకాశం ఉంటుంది. ఒకే పొలంలో ఖరీఫ్‌లో కంది, రబీలో పెసర, మినుము పంటల సాగు చేసుకునేందుకు వీలు ఉంటుంది. రైతుకు ఒక ఎకరాపై నికర ఆదాయం పెరుగుతుంది. తక్కువ సారవంతమైన భూముల్లో కూడా కంది సాగు చేసుకునేందుకు వీలు ఉంటుంది. కంది పంటలో కలుపు నివారణ పనులు సునాయాశంగా ఉంటుంది. అంతర్‌పంటల ప్రోత్సాహంలో భాగంగా కంది పంట సాగుపై ఆసక్తి కలిగిన రైతులను ఎంపిక చేసి ఉచితంగా కంది విత్తనాలను అందజేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రసన్న ఆర్థిక సాయం



రూ.లక్ష నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- మదర్సా, మసీదు నిర్మాణానికి రూ.లక్ష అందజేత

కోవూరు : మండలంలోని పడుగుపాడు నేతాజీనగర్‌లో నూతనంగా నిర్మించనున్న అజీముష్షన్ సంగె బున్యాద్ మసీద్ – ఏ – ఔలియా, మదర్సా నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. దీనికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం జరగ్గా, ఎమ్మెల్యే ప్రసన్న ముఖ్యఅతిథిగా హాజరై తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు తరఫున రూ.లక్ష సాయాన్ని మతపెద్దల సమక్షంలో కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మసీదుతో పాటు మదర్సా నిర్మాణాన్ని చేపట్టడం సంతోషకరమన్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే హైదరాబాద్‌లోని పాతబస్తీ అభివృద్ధి చెందిందని, దీనిని అక్బరుద్దీన్ ఓవైసీ స్వయంగా తెలిపారన్నారు. ముస్లింలకు సముచిత స్థానం కల్పించాలన్న ఉద్దేశంతో రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. అలాగే ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ పచ్చిపాల రామనాథమ్మ ట్రస్టు తరఫున మదర్సా నిర్మాణానికి రూ.25 వేలు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, సర్పంచ్‌లు విజయ, లక్ష్మీకుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు, మతపెద్దలు పాల్గొన్నారు.

గంగమ్మకు పొంగళ్ల సమర్పణ



దేవస్థానం ప్రాంగణంలో పొంగళ్లు పెడుతున్న మహిళలు

పొదలకూరు : పట్టణంలోని గంగమ్మతల్లికి మహిళలు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం 3 గంటల నుంచి మహిళలు పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్లు పెట్టుకునే సామగ్రితో తప్పెట్లు, బాణసంచాలతో దేవస్థానానికి చేరుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాలను నిర్వహించారు.



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న యాదవ సంఘ నేతలు

సింగిల్ నంబర్లాటపై దాడులు

- ఏడుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సింగిల్ నంబర్లాటపై వేదాయపాళెం పోలీసులు దాడులు చేశారు. ఇద్దరు నిర్వాహకులతో పాటు ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ ఆదేశాల మేరకు ఈ నెల 8న డైకస్‌రోడ్డు ఎస్‌సీసీకాలనీ మొదటివీధిలో సింగిల్ నంబర్లాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకుడు శివాజీనగర్‌కు చెందిన ఎల్ నరసింహులుతో పాటు ఎస్‌సీసీ కాలనీకి చెందిన జూదరులు నరసింహారెడ్డి, వెంగళరావునగర్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం డైకస్‌రోడ్డు, వైటినాయుడు సందులోని ఖాళీ ప్రదేశంలో సింగిల్ నంబర్లాట నిర్వహిస్తుండగా దాడులు చేశారు. నిర్వాహకుడు వెంగళరావు నగర్‌కు చెందిన షేక్ షామీర్, జూదరులు వెంగళరావునగర్‌కు చెందిన రబ్బాని, ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన రహమతుల్లా, ఇక్బాల్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దాడులు ముమ్మరం చేస్తున్నామన్నారు. ఈ తరహా జూదాలు నిర్వహిస్తుంటే డయల్ 112 లేదా 94407 96304 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

నేడు వాహనాల బహిరంగ వేలం





వేలం నిర్వహించనున్న బొలెరో, బైక్

కొడవలూరు: కోవూరు సెబ్ స్టేషన్ ఆవరణలో మూడు వాహనాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ సీఐ ఆర్. నరహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఈబీ అధీనంలోని మహేంద్ర బొలెరో పికప్ ఎల్ఎంవీ, బజాజ్ పల్సర్, టీవీఎస్ రైడర్ మోటార్ సైకిళ్లకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహేంద్ర బొలెరో వాహనం ధర రూ.4,50 లక్షలు, బజాజ్ పల్సర్ రూ.24 వేలు, టీవీఎస్ రైడర్ రూ.47 వేలుగా నిర్ణయించినట్లు చెప్పారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు నిర్ణయించిన ధరలో పది శాతం చెల్లించాలని, దీని ప్రకారం బొలెరో వాహనానికి రూ.45 వేలు, పల్సర్ బైక్‌కు రూ.2,400, టీవీఎస్ రైడర్‌కు రూ.4,700 వంతున ధరావత్తు చెల్లించి కోవూరు ఎస్ఈబీ స్టేషన్ వద్ద ఉదయం 10.30 గంటలకు జరుగనున్న బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు.

రైతు బజార్ సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన రైతుబజార్

- త్వరలో ప్రారంభం

పొదలకూరు : అందరికీ అందుబాటులో పట్టణ నడిబొడ్డున రైతు బజార్ సిద్ధమైంది. ముఖ్యంగా మహిళలకు రైతు బజార్ ఎంతో ఉపయోగపడనుంది. రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టుబట్టి రైతుబజార్‌కు నిధులు సమకూర్చి నిర్మాణ పనులు పూర్తి చేయించారు. త్వరలో ప్రారంభానికి సిద్ధంగా బజార్ ముస్తాబైంది. తొలుత రూ.10 లక్షల పనులు జరిగి అనివార్య కారణాల వల్ల రైతుబజార్ నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొంది. కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వెంటనే మరో రూ.18 లక్షలను మంజూరు చేయించి నిర్మాణ పనులు పూర్తి చేయించారు. ఇక్కడ 20 మంది వ్యాపారాలు చేసుకునేందుకు అనువుగా ప్లాట్‌ఫామ్స్‌ను నిర్మించారు. అంతేకాకుండా మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించారు. ఫలితంగా కూరగాయలు, పండ్లు, రైతులు తమ పంటలను ఇక్కడ విక్రయించుకునేందుకు అవకాశం ఏర్పడనుంది. మార్కెటింగ్‌శాఖ పర్యవేక్షణలో ఇక్కడ వ్యాపారాలు చేసుకోవాల్సి ఉంటుంది.

శరవేగంగా.. ప్రగతి పరుగు

- డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి నుడా నిధులు
- పట్టణంలో మట్టిరోడ్లు లేకుండా చర్యలు



వినాయకమాన్యం ప్రాంతంలో జరుగుతున్న సైడ్‌డ్రెయిన్ పనులు

పొదలకూరు : పట్టణంలో ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు, సైడ్ డ్రెయిన్లు దర్శనం ఇస్తున్నాయి. ఏ వీధికి సిమెంటురోడ్డు కావాలన్నా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంటనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తున్నారు. పట్టణంలో సైడ్‌డ్రెయిన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నివాసితులు ఇప్పుడు డ్రెయిన్ల నిర్మాణంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో కొత్తగా సుమారు రూ.2 కోట్లకు పైగా నుడా నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వినాయకమాన్యం, కాకాణి రమణారెడ్డి నగర్, శ్రీనివాసపురం తదితర ప్రాంతాల్లో పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం మంత్రి కాకాణి ప్రతినిత్యం ఇంజినీరింగ్ అధికారుల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. పట్టణంలో సందుగొందుల్లో సైతం సిమెంటురోడ్ల నిర్మాణం చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా ఎందరో ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతానికి ప్రాతినిత్యం వహించినా జరగని అభివృద్ధి గత నాలుగేళ్లలో జరగడం విశేషం. గతంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి జెడ్పీచైర్మన్‌గా పట్టణంలో సిమెంటురోడ్లు వేయించారు. తర్వాత పట్టణంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఐదేళ్ల కాకాణి ప్రతిపక్ష ఎమ్మెల్యేగా పనులు చేయించలేకపోయారు. ఫలితంగా అధికార పార్టీ ఎమ్మెల్యేగా, మంత్రిగా పదేళ్లకు సరిపడా అభివృద్ధి పనులు చేయిస్తున్నారు.

పొదలకూరు పంచాయతీకి రూ.30 కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పొదలకూరు మేజర్ పంచాయతీలో సిమెంటురోడ్లు, సైడ్ డ్రెయిన్లకు రూ.25 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో ప్రతి వీధిలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం జరిగింది. తర్వాత పంచాయతీ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' జరిగిన సందర్భంలో మరో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పుడు మంత్రి కాకాణి చొరవతో కొత్తగా నుడా నిధులు మంజూరై మిగిలిన పనులు వేగంగా జరుగుతున్నాయి. సాధారణ ప్రజలు సైతం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వద్దకు వెళ్లి తమ ప్రాంతంలో రోడ్డు లేదని, డ్రెయిన్ కావాలని అభ్యర్థిస్తే వెంటనే మంజూరు చేయిస్తున్నారు. ఫలితంగా ఒక్క పొదలకూరు పంచాయతీలోనే రోడ్లు, డ్రెయిన్లకు రూ.30 కోట్ల నిధులను వెచ్చించారు.



నిర్మాణం పూర్తయిన సిమెంట్‌రోడ్డు